సాక్షి
నంద్యాల
శనివారం । 23 । డిసెంబర్ । 2023



కేసీ కెనాల్‌కు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



ప్రమాదరహితం.. సేవాపథం

టోల్‌ప్లాజా పరిధిలో ప్రయాణికులకు తెలియని ఎన్నో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రయాణం సాఫీగా సాగేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

8లో▸

న్యూస్‌రీల్

రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి

● జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

డోన్ టౌన్: జగనన్న భూ రక్ష- భూ సర్వే పథకం కింద చేపట్టిన భూముల రీ సర్వే పకడ్బందీగా గడువులోపు పూర్తి చేయాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి సర్వేయర్లను ఆదేశించారు. స్థానిక రోడ్లు భవనాలశాఖ నూతన అతిథి గృహంలో శుక్రవారం డివిజన్ స్థాయి తహసీల్దార్లు, సర్వేయర్లతో రీ సర్వే పనులపై డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డితో కలిసి జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతాంగానికి వారి భూములను నిక్కచ్చిగా తెల్చి చెప్పడంతో పాటు సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుందన్నారు. మూడవ విడత కింద చేపట్టిన సర్వే పనులపై మండలాల వారీగా వివరాలు సేకరించిన జేసీ సర్వేలో వెనుకబడిన అధికారులు, సర్వేయర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోపు సర్వే చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో బేతంచెర్ల, ప్యాపిలి, బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.4,44,444 విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన బొగ్గరపు సోదరులు వెంకటేశ్వర్లు, లత, వెంకటాచలం మంజుల దంపతులు రూ.4,44,444 విరాళంగా అందజేశారు. శుక్రవారం అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటేష్, అర్జున్, మల్లికార్జున, సతీష్‌లకు విరాళం నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

అడిగిన వారందరికీ జాబ్ కార్డులివ్వండి

● పీడీ రామచంద్రారెడ్డి

చాగలమర్రి: ఉపాధిహామీ పథకం పనులు అడిగిన వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2.8 లక్షల జాబ్ కార్డులను మంజూరు చేశామన్నారు. వారిలో కొన్ని కుటుంబాలు 90 రోజులు మాత్రమే పని చేయడం జరిగిందన్నారు. అలాంటి వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు వంద రోజులు పని కల్పించాలన్నారు. పనులు అవసరం లేని వారిని గుర్తించి తాత్కాలికంగా జాబ్‌కార్డులు తొలగించాలన్నారు. ఈ అంశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏపీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

సులువుగా.. సక్సెస్‌ఫుల్‌గా!

- సత్ఫలితాలిస్తున్న కార్డ్‌ప్రైమ్ 2.0
- రిజిస్ట్రేషన్లు సులభతరం చేసిన ప్రభుత్వం
- జిల్లాలో నెలన్నర వ్యవధిలో 7,478 రిజిస్ట్రేషన్లు
- వినియోగదారుడే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లు చేసుకునే అవకాశం
- అవినీతి, అక్రమాలకు చెక్

రిజిస్ట్రేషన్ సేవలు మరింత సరళమయ్యాయి. కాలానుగుణంగా అవినీతి అక్రమాలకు తావులేకుండా వినియోగదారులకు కచ్చితమైన సేవలందేలా రాష్ట్ర ప్రభుత్వం కార్డ్‌ప్రైమ్ 2.0 విధానంతో రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేసింది. ఇరవై నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా సరికొత్త విధానం అందుబాటులోకి తేవడంతో స్థిర, చరాస్తుల క్రయ, విక్రయదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనే దస్తావేజులు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజ్ చెల్లించే వెసులుబాటు కల్పించడంతో సేవలు పారదర్శకంగా కొనసాగుతున్నాయి.

కోవెలకుంట్ల: ఆస్తుల క్రయ, విక్రయదారులకు పారదర్శక సేవలందించాలన్న ఉద్దేశంతో కార్డ్‌ప్రైమ్ 1.0 స్థానంలో గత నెల నుంచి ప్రవేశ పెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానంతో రిజిస్ట్రేషన్ సేవలు సులువుగా.. వేగంగా అందుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానం ద్వారా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. నూతన సాఫ్ట్‌వేర్ విధానం అమల్లోకి రావడంతో రిజిస్ట్రేషన్లకు సంబంధించి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారుడే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను తయారు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో సూచించిన మేర స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే ప్రక్రియ సులభంగా పూర్తవుతుంది. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివి బయట చేసుకునేవారు. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పిస్తే రిజిస్ట్రేషన్లు చేసేవారు. ఈ ప్రక్రియతో క్రయ, విక్రయదారులు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొనేవారు. మధ్యవర్తుల ప్రమేయం చోటు చేసుకోవడంతో అనదంగా డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పాత విధానానికి స్వస్తి పలికి కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని అందుబాటులోకి తీసుకరావడంతో దళారుల దందాకు చెక్‌పడింది. జిల్లాలో నెలన్నర వ్యవధిలోనే సత్ఫలితాలు ఇస్తుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆత్మకూరు, బండిఆత్మకూరు, అవుకు, పాణ్యం, డోన్, ప్యాపిలి, శిరువెళ్ల, బేతంచెర్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గత నెలలో కొత్త విధానం అమలు కాగా ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు కొత్త విధానం ద్వారా 7,478 రిజిస్ట్రేషన్లు జరిగాయి. నూతన పద్ధతిలో సేవలు పారదర్శకంగా మారాయి.



20 నిమిషాల వ్యవధిలోనే ..

క్రయ, విక్రయదారులు ఆస్తి వివరాలు, పేరు, ఆధార్‌వంటి సమాచారాన్ని ఆనమోదు చేస్తే వెంటనే ఆస్తికి సంబంధించిన మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో స్క్రీన్‌పై కనిపిస్తోంది. ఆ సొమ్మును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కాని స్టాక్ హోల్డింగ్ ద్వారా చలానా కట్టవచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్, స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సరిపోతుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగిస్తారు. ఇందుకోసం కేవలం 20 నిమిషాలు సమయం పడుతుంది. పాత విధానంలో రోజంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. కొత్త విధానంతో కేవలం అర గంటలోనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతండటంతో క్రయ, విక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోవెలకుంట్ల రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్న దృశ్యం

అవినీతి, అక్రమాలకు చెక్

రిజిస్ట్రేషన్ల సమయంలో అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఆస్తుల విక్రయాల్లో పారదర్శకతను పెంచి ఆస్తులను పరిరక్షించేందుకు కొత్త విధానం ఎంతో దోహద పడుతోంది. క్రయ, విక్రయదారులు దస్తావేజును స్వతహాగా ఎవరికి వారే తయారు చేసుకుని ఎక్కడ కావాలంటే అక్కడ రిజిస్ట్రేషన్ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. చలానా, డాక్యుమెంట్, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల రూపంలో మధ్యవర్తులకు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్‌లో కనబడే మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునే ఆస్కారం ఉంది. దీంతో క్రయ, విక్రయదారులకు వ్యయ, ప్రయాసలు తగ్గి సులభంగా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కలిగింది. దీంతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అందరూ హర్షిస్తున్నారు.

జిల్లాలో కొత్త విధానం ద్వారా పూర్తయిన రిజిస్ట్రేషన్లు

ప్రాంతం	రిజిస్ట్రేషన్లు
కోవెలకుంట్ల	700
బేతంచెర్ల	650
బనగానపల్లె	550
ఆత్మకూరు	320
నంద్యాల	1,680
నందికొట్కూరు	150
పాణ్యం	364
అవుకు	384
డోన్	760
ప్యాపిలి	370
ఆళ్లగడ్డ	750
శిరివెళ్ల	480
బండిఆత్మకూరు	320

కొత్త పద్ధతి బాగుంది



రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానాన్ని అమల్లోకి తేవడంతో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరమయ్యాయి. గతంలో భూములు, స్థలాలు, ఇళ్లు, తదితర వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఉదయం వెళితే సాయంత్రం వరకు అక్కడే వేచి ఉండాల్సి వచ్చేది. కొత్త విధానంలో కేవలం 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండటం శుభ పరిణామం.

– గుర్రప్ప, కోవెలకుంట్ల

ఇబ్బందులు తొలగిపోయాయి



ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త విధానం అమల్లోకి రావడంతో పలు ఇబ్బందులు తొలగిపోయాయి. గతంలో భూమి, స్థలం, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మధ్యవర్తుల వద్దకు వెళ్లి వారు చెప్పినంత నగదు ఇచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. నూతనం విధానంలో క్రయ, విక్రయ దారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకుని సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

– సుధాకర్, కోవెలకుంట్ల

సద్వినియోగం చేసుకోండి



రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుంచి అమల్లోకి తెచ్చిన కార్డ్‌ప్రైమ్ 2.0 విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు సంబంధించి ఇప్పటి వరకు 700 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సర్వేశ్వనాథ్, సబ్ రిజిస్ట్రార్, కోవెలకుంట్ల

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయెె!

- నేడు జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు
- ప్రదర్శనకు 140 ప్రాజెక్టులు ఎంపిక



నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. విద్యార్థుల్లో వైజ్ఞానిక విజ్ఞానం పెంపొందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా వైజ్ఞానిక పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 23న జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి సూచనలు మేరకు ప్రతి మండలం నుంచి మూడు ప్రాజెక్టుల చొప్పున దాదాపు 140 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణిత, ఖగోళ, పర్యావరణ, జీవ శాస్త్రాలతో పాటు ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లోని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 10 ఉత్తమ ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు తెలిపారు. గత ఏడాది కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన ఆరోగ్యం పరిరక్షణ, పర్యావరణ హిత పదార్థాల వాడకం ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీఈఓ తెలిపారు.

16 మందికి 'కారుణ్య' ఉద్యోగాలు

● కౌన్సెలింగ్ నిర్వహించిన డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): కారుణ్య నియామకాల కింద 16 మంది జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం డీఆర్వో కె.మధుసూదన్ రావు తన కార్యాలయంలో డిపార్టుమెంట్ ఆప్షన్ ఎంచుకోవడానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. 16మందిలో 13 మంది కర్నూలు పరిధిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయాన్ని, ఒకరు నంద్యాల టీజీపీ ఎస్‌ఈ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. అగ్రిట్రేడ్ మార్కెటింగ్ విభాగంలో ఒకరు, కర్నూలు ఐసీడీఎస్‌లో పనిచేయడానికి ఒకరు ఆప్షన్ ఇచ్చారు. త్వరలోనే వీరికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు డీఆర్వో తెలిపారు.



విద్యుదీపాలంకరణలో నంద్యాల పట్టణంలోని గుడిపాటిగడ్డ శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయాల వద్ద బారికేడ్లతో పాటు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శ్రీశైలం, మహానంది, అహోబిలం, మద్దిలేటయ్య క్షేత్రాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు పట్టణాల్లో వైష్ణవ, శివాలయాలను విద్యుత్‌దీపాలు, పుష్పాలతో అలంకరించారు. మూడు కోట్ల మంది దేవతలు వైకుంఠానికి చేరుకునే పుణ్య ప్రదమైన రోజును వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారని, ఆ రోజు శ్రీహరిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.

– నంద్యాల(వ్యవసాయం)

వైఎస్ జగన్ పాలనలో ప్రతి నెలా పింఛన్ వస్తోంది



నాకు గత ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ వచ్చేది. అయితే గతంలో ఒక నెల ఇస్తే మరో నెల ఎగ్గొట్టే వారు. పింఛన్ కోసం పది రోజులు తిరగాల్సి వచ్చేది. పింఛన్లు ఇచ్చే రోజు వేలి ముద్ర పడటం లేదని కొంత మందికి ఇచ్చి మరి కొందరికి ఆపే వారు. మళ్లీ ఇస్తామని చెప్పి ఎగొట్టిన నెలలు ఎన్నో ఉన్నాయి. అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చే నెల కలిపి ఇస్తామని చెప్పడం.. ఆ తర్వాత ఊసే ఎత్తే వారు కాదు. ప్రస్తుతం మహానుభావుడు జగనన్న పాలనలో ప్రతి నెలా పింఛన్ వస్తోంది. ఇంటి వద్దకే వలంటీరు ఇచ్చి పింఛన్ ఇస్తున్నారు. వచ్చే నెల నుంచి రూ. 3 వేలు ఇస్తుండటంతో ఎంతో ఆనందంగా ఉంది. వృద్ధుల కష్టాలు తెలుసుకుని ఠంఛన్‌గా పింఛన్ ఇచ్చే జగనన్నకు రుణపడి ఉంటాం.

– వెంకటమ్మ, రెడ్డిపల్లె, రుద్రవరం మండలం

సంక్షేమ బావుటా

మేలు చేసిన ప్రభుత్వాన్ని మరువలేం



నా భర్త రమణయ్య 15 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఎన్నో ఏళ్ల నుంచి మట్టి మిద్దెలో నివాసం ఉంటూ కాలం వెల్లదీశాం. వర్షాకాలంలో ఇల్లు కారుతుండటంతో అవస్థలు పడేవాళ్లం. సొంతంగా ఇల్లు నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో పాడుబడిన ఇంట్లోనే నివాసముంటూ ఇబ్బందులు పడినాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్ల క్రితం పక్కాగృహం మంజూరు చేసింది. పాత ఇంటిని పడగొట్టి కొత్తగా ఇంటిని నిర్మించుకున్నాను. జీవితంలో ఇల్లు కట్టుకుంటానో లేదో అనే అనుమానం ఉండేది. ప్రభుత్వం ఆ కలను నెరవేర్చింది. మాకు గూడు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఎప్పటికీ నడుస్తాం.

– లక్ష్మీదేవి, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

మల్లన్న చెంత.. తీరనున్న వసతి చింత!

- శ్రీశైలంలో భక్తులకు మరింత వసతి సౌకర్యాలు
- రూ.52 కోట్లతో 200 వసతి గదుల సముదాయం
- ట్రస్ట్‌బోర్డు ఆమోదం..కమిషనర్ అనుమతులకు ప్రతిపాదనలు
- త్వరలో పనుల ప్రారంభం



శ్రీశైలం ఆలయం



క్షేత్ర సమీపంలో గంగా సదనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతుంది. ఈ క్రమంలో క్షేత్రానికి చేరుకునే భక్తులందరికీ వసతి గదులు లభించడం కష్టతరంగా మారింది. ఈ సమస్యపై దృష్టి సారించిన దేవస్థాన ధర్మకర్తల మండలి అదనంగా వసతి గదులు నిర్మించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపింది. సుమారు రూ.52 కోట్ల అంచనా వ్యయంతో 200 గదుల వసతి సముదాయాన్ని నిర్మించేందుకు బోర్డు ఆమోదం తెలిపి దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, నిర్మాణాలను చేపట్టనున్నారు. తద్వారా భక్తులకు వసతి కష్టాలు తీరనున్నాయి. భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి సాధారణ రోజుల్లో 10 వేల నుంచి 20 వేల మంది భక్తులు, శని, ఆది, సోమవారాల్లో 20 వేల నుంచి 35 వేల మంది భక్తులు, ముఖ్యమైన పర్వదినాల్లో 40 వేల నుంచి 60 వేల మంది తరలివస్తారు. రద్దీ రోజుల్లో, ముఖ్యమైన పర్వదినాల్లో భక్తులకు వసతి కష్టాలు తప్పడం లేదు. క్షేత్ర పరిధిలో ఉన్న వసతి గదుల కంటే రెండు రెట్లు అధికంగా భక్తుల రాక ఉండడంతో భక్తులకు వసతి కష్టతరంగా మారింది. అంతేకాకుండా ఇతర దేవస్థానాల మాదిరి కాకుండా శ్రీశైల యాత్రకు వచ్చే భక్తులు తప్పనిసరిగా వసతి సౌకర్యానికి శ్రీశైలంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో భక్తులకు వసతి కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి.


ప్రస్తుతానికి 22 వేల మందికే..

శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం తరుపున వీఐపీ కాటేజీలు-33, గంగా, గౌరీ సదన్‌లో 140 గదులు, పాతాళేశ్వర సదన్- 50, మల్లికార్జున సదన్- 65, గణేశ సదన్-224, అంబా, కుమార సదన్- 80, డార్మెంటరీలు-2, హాల్స్ (100 మంది వసతి పొందే)- 10 ఉన్నాయి. దేవస్థానం వసతి గదుల్లో సుమారు 6వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. అలాగే క్షేత్ర పరిధిలో 55 కుల సంఘాల చెందిన అన్నదాన సత్రాలు ఉన్నాయి. అన్ని సత్రాల్లో కలిపి సుమారు 4వేల వసతి గదులు ఉండగా వీటి ద్వారా 16 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. దేవస్థానం, సత్రాల వసతి గదులను కలుపుకుంటే మొత్తం సుమారు 22 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంది.

వసతి కష్టాన్ని అధిగమించేలా..

శ్రీశైలంలో భక్తుల వసతి సౌకర్యం దృష్ట్యా ప్రస్తుతం ఉన్న గంగా, గౌరీ, గణేశ్ సదన్ తరహాలోనే సరికొత్తగా వసతి సముదాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు సుమారు రూ.52 కోట్ల అంచనా వ్యయంతో 200 వసతి గదుల సముదాయాన్ని నిర్మించేందుకు ట్రస్ట్‌బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆయా ప్రతిపాదనలను దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం పంపారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. తద్వారా భక్తులకు వసతి కష్టాలు తీరనున్నాయి.

వసతుల కల్పనకు ప్రాధాన్యత



శ్రీశైల యాత్రకు విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ట్రస్ట్‌బోర్డు ధ్యేయం. ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అయినప్పటి నుంచి క్షేత్రాభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లో కూడా నిరుపయోగంగా ఉన్న దుకాణాలను మరమ్మత్తులు చేయించి వసతి గదులుగా మారుస్తున్నాం. త్వరలోనే అవి అందుబాటులోకి తీసుకువస్తాం.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్

అనుమతి రాగానే పనులు ప్రారంభం



శ్రీశైల క్షేత్రంలో భక్తుల వసతి కష్టాలను అధిగమించేందుకు నూతనంగా 200 వసతి గదుల సముదాయాన్ని, డార్మెంటరీలను నిర్మించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. దేవదాయ కమిషనర్ అనుమతి కోసం నిరీక్షిస్తున్నాం. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పూర్తి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం. మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

ఏపీజీఎల్ఐ ఏడీగా గౌరి ప్రసన్న

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) కర్నూలు జాయింట్ డైరెక్టర్ కార్యాలయం అసిస్టెంటు డైరెక్టర్‌గా ఎస్.గౌరి ప్రసన్నను నియమిస్తూ ఏపీజీఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని ఏపీజీఎల్ఐ డైరెక్టరేట్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న గౌరిప్రసన్నకు అసిస్టెంటు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఇంతవరకు ఇక్కడ ఏడీగా పనిచేసిన వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఏడీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఈ నియామకం జరిగింది. రెండు, మూడు రోజుల్లో ఈమె బాధ్యతలు స్వీకరిస్తారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 67 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో ఐదో సెమిస్టర్ పరీక్షకు 10,937 మందికి గాను 10,053 మంది, మధ్యాహ్నం సెషన్‌లో మొదటి సెమిస్టర్ పరీక్షకు 11,272 మందికి గాను 10,324 మంది హాజరయ్యారు. చూచిరాతలకు పాల్పడిన ఎమ్మిగనూరు సిద్దార్థ డిగ్రీ కళాశాల, హనుమాపురం నలంద డిగ్రీ కళాశాల, కర్నూలు సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ముగ్గురు విద్యార్థులు డిబార్ చేశామని డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు.

పాముకాటుతో చిన్నారి మృతి


రుత్విక (ఫైల్)

కృష్ణగిరి: పాము కాటు గురై చిన్నారి మృతి చెందిన ఘటన పెద్దొడ్డి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవికుమార్‌కు ఆలంకొండ గ్రామానికి చెందిన గీతాంజలికి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కూమార్తె రుత్విక ఉంది. ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలంలో రాత్రి ఆరున్నర గంటల సమయంలో చిన్నారి ఆడుకుంటూ గోడ దగ్గరకు వెళ్లి ఏడవడంతో తల్లి వెళ్లి చూడగా చిన్నారికి కాలికి రక్తం చుక్కలు రావడాన్ని గమనించి భర్తకు తెలిపింది. వెంటనే ఆతను టార్చిలైట్ వేయగా రెండు పాములు కనిపించాయి. ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వగా రెండు నాగు పాములను చంపారు. వెంటనే చిన్నారిని 108లో కర్నూలుకు తరలిస్తుండగా వెల్దుర్తి దగ్గరకు వచ్చేసరికి చిన్నారి మృతి చెందింది.

ఉయ్యాలే.. ఉరితాడు


రేయాన్స్ (ఫైల్)

డోన్ టౌన్: సరదాగా ఊయల ఊగుతున్న ఆ చిన్నారిని ఊయల తాడే ఉరితాడుగా మారి ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన పట్టణంలోని శ్రీరామనగర్‌లో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి సుధాకర్ పెద్ద కుమారుడైన రేయాన్స్ (7) గురువారం ఇంటిలో ఊయల ఊగుతూ ఉండగా గొంతుకు తాడు బిగుసుక పోయి ఊపిరి ఆడక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కొద్ది సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతి చెందిన చిన్నారి రేయాన్స్ పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్నట్లు తెలిసింది. బాలుడి మృతితో కాలనీలో శుక్రవారం విషాదం నెలకొంది.

ప్రమాదరహితం.. సేవాపథం


నన్నూరు టోల్‌ప్లాజా సముదాయం

టోల్‌గేట్ కనిపించగానే భారంగా భావిస్తాం. ఏంటిది, ఈ డబ్బు వసూళ్లు ఎందుకు? అనే అనుమానం కలుగుతుంది. అప్పటి వరకు వెడల్పాటి రహదారులపై సాఫీగా సాగిన ప్రయాణాన్ని మరిచి విమర్శలు గుప్పించడం పరిపాటి. ఏం చేశారని ఇంత డబ్బు గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యక్తులు కోకొల్లలు. అయితే రహదారిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగానే ఈ వసూళ్లు అనే విషయం చాలా మందికి తెలియని అంశం. అంతేకాదు.. టోల్‌ప్లాజా పరిధిలో ప్రయాణికులకు తెలియని ఎన్నో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. మనకు తెలియకుండానే ఈ ప్రాంతం వాహన చోదకులకు తోడుగా నిలుస్తోంది. టోల్‌ప్లాజా పరిధిలో కిలోమీటర్ల మేర ప్రయాణం సాఫీగా సాగేందుకు ఎంతో దోహదపడుతోంది. ఎప్పుడు ఎలాంటి ఆపద కలిగినా మేమున్నామంటూ ముందుకొస్తోంది. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు.. ఎన్నో రకాల సేవలను అందిస్తోంది. – సాక్షి, కర్నూలు డెస్క్



పెట్రోలింగ్ వాహనం

రూట్ పెట్రోలింగ్ వెహికల్ సర్వీసెస్

>> వెహికల్ బ్రేక్ డౌన్స్
(ఏ సమయంలోనైనా సమాచారం అందుకున్న వెంటనే పెట్రోలింగ్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుంటుంది. ముందుగా వాహన భద్రత దృష్ట్యా రెడ్ సేఫ్టీకోన్స్ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత సమస్యను తెలుసుకుంటారు. డీజిల్/పెట్రోల్ అయిపోయిందా? టైర్ పంక్చర్ అయిందా? లేక ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా తెలుసుకొని ఆ మేరకు చర్యలు తీసుకుంటారు. డీజిల్/పెట్రోల్ అయిపోయినట్లయితే.. వాహన చోదకులతో అందుకు సంబంధించిన నగదును మాత్రమే తీసుకొని సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్లి తీసుకొచ్చి వాహనం స్టార్ట్ అయ్యేంత వరకు బాధ్యతను తీసుకుంటారు. టైర్ పంక్చర్ అయినా పెట్రోలింగ్ వాహన సిబ్బంది మార్పు చేస్తారు.) పెట్రోలింగ్ వాహనంలో ఒక రూట్ ఆఫీసర్, హెల్పర్, డ్రైవర్ నిరంతరం అందుబాటులో ఉంటారు.

>> యాక్సిండెంట్స్ రిమూవల్
సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకొని తీవ్రతను పరిశీలిస్తారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటారు. యాక్సిడెంట్ వాహనాలతో ఇతర ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వాటిని పక్కకు తొలగిస్తారు. ప్రమాదంలో ఎవరికైనా గాయాలైనట్లు గుర్తిస్తే.. వెంటనే ఫస్ట్ ఎయిడ్ చేస్తారు. అంతేకాదు.. ప్రతి టోల్‌ప్లాజాలో ఒక ఫస్ట్ ఎయిడ్ రూం ఉంటుంది. ఇక్కడ పారామెడిక్ (బీఎస్సీ నర్సింగ్), హెల్పర్, డ్రైవర్ అందుబాటులో ఉంటారు. వీరి సేవలను 24జ7 ఉపయోగించుకునే వీలుంది.

>> సురక్షిత ప్రాంతాలకు తరలించడం
మానసిక రోగులు రాత్రిళ్లు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంటారు. ఇలాంటి వారిని గుర్తించి సమీపంలోని దేవాలయాలు, లేదా జనసంచారం ఉన్న ప్రాంతాల్లో వదులుతారు. అదేవిధంగా అతిగా మద్యం సేవించి పడిపోయిన వాళ్లను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. రహదారిలో చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగిస్తారు.

>> అనుమతిలేని చోట పార్కింగ్
అధిక శాతం ప్రమాదాలు రాత్రి వేళల్లోనే చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోలింగ్ వాహన సిబ్బంది తెల్లవారుజామున 2 నుంచి 5 గంటల మధ్య అనుమతిలేని చోట పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వాహన డ్రైవర్ అందుబాటులో లేకపోతే పక్కకు తొలగిస్తారు. ఆయా డ్రైవర్లకు ఫేస్ వాష్ చేయించడంతో పాటు సమీపంలోని పార్కింగ్ స్థలాన్ని తెలియజేసి అక్కడ సేదతీరేందుకు సూచిస్తారు.

నేషనల్ హైవే 40 పరిధి	రహదారిలోని టోల్ గేట్లు
కర్నూలు నుంచి కడప వరకు 188 కిలోమీటర్లు	నన్నూరు, చాపిరేవుల, చాగలమర్రి, పాటిమీదపల్లి

అత్యవసర వేళల్లో సంప్రదించాల్సిన నంబర్లు

రూట్ పెట్రోలింగ్ వాహనం: 7997710182	టో క్రేన్ హైడ్రా(20 టన్స్): 9618030009
అంబులెన్స్: 7997710181	కంట్రోల్ రూం: 7036500054

నేషనల్ హైవే హెల్ప్‌లైన్: 1033

అంబులెన్స్



ప్రయాణికుల సేవకు సిద్ధంగా అంబులెన్స్

ప్రతి టోల్‌ప్లాజాలో అడ్వాన్స్‌డ్ బేసిక్ లైఫ్ సపోర్టు అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగిన సమాచారం తెలిసిన వెంటనే ఈ వాహనం ఘటనా స్థలికి చేరుకుంటుంది. తీవ్రతను పరిశీలించి సేవలు అందిస్తారు. బాధిత కోరిక మేరకు ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులకు ఎలాంటి నగదు తీసుకోకుండానే తరలిస్తారు. ప్రథమ చికిత్స అందించడంతో పాటు గాయాలకు కట్లు కట్టడం చేస్తారు.

టోల్‌ప్లాజాలో విస్తృత సేవలు

టోల్ ప్లాజా అనగానే డబ్బు మాత్రమే వసూలు చేస్తారనుకోవడం పొరపాటు. అందుకు తగిన సేవలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా తాగునీరు ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా అత్యవసరమైతే వాష్‌రూమ్స్‌ను వినియోగించుకోవచ్చు. చిన్న చిన్న గాయాలకు కూడా ఇక్కడ చికిత్స చేయించుకునే వీలుంది.


టోల్‌ప్లాజాలోని మరుగుదొడ్లు


ఫస్ట్ ఎయిడ్ రూం

- ప్రతి రోజూ అర్ధరాత్రి సమయంలో వాహన డ్రైవర్లకు ఫేస్ వాష్ చేయించడంతో పాటు టీ అందిస్తారు. సుమారు 50 మంది వరకు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

- జాతీయ రహదారికి సమీపంలోని గ్రామీణ ప్రాంత వాహన చోదకులకు ప్రతి రోజూ రేడియం స్టిక్కర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తారు. స్టిక్కర్స్ లేని వాహనాలను గుర్తించి ఎలాంటి డబ్బు తీసుకోకుండానే వీటిని అమరుస్తారు.
- రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్ వాహనాలను గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తారు.
- సీట్ బెల్ట్ పెట్టుకోకపోయినా, హెల్మెట ధరించకపోయినా గుర్తిస్తారు.
- ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేస్తారు.

నెలవారీ కార్యక్రమాలు ఇలా..

- టోల్‌ప్లాజా పరిధిలోని ప్రధాన రహదారికి సమీపంలో పాఠశాలలు ఉన్నట్లయితే పిల్లలను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రోడ్డు దాటిస్తారు. ఈ విషయంలో పిల్లలకు అవగాహన కల్పిస్తారు.
- రహదారి ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అధిక శాతం ప్రయాణికులు భయంతో గుండెపోటుకు గురవుతారు. ఈ నేపథ్యంలో సీపీఆర్ ఎంతో కీలకం. అందువల్ల నెలకోసారి ప్రధాన జంక్షన్లలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

1.12.23
తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో కడప వైపునకు అత్యంత వేగంగా వెళ్తున్న స్కూటీ వాహనం అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. 3.27 గంటలకు సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా అంబులెన్స్ వాహనం 3.34 గంటల సమయంలో ఘటనా స్థలికి చేరుకుంది. స్వల్ప గాయాలైన వారికి అక్కడికక్కడే వైద్య సేవలు అందించారు. ఆ తర్వాత ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకొని ప్రమాద సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు.

ప్రమాదాల తీవ్రత ఇలా.. (2023-24)

చిన్న ప్రమాదాలు	పెద్ద ప్రమాదాలు	భారీ ప్రమాదాలు
182	80	24

గమనిక: 30.11.23 నాటి వరకు గణాంకాల ఆధారంగా..

తెల్లవారుజాము నుంచి ఏ సమయంలో ఎన్ని ప్రమాదాలు (2023-24)

గంటలు	00-3	3-6	6-9	9-12	12-3	3-6	6-9	9-12
ప్రమాదాలు	53	54	46	66	71	75	61	41

(గమనిక: 30.11.23 నాటి వరకు గణాంకాల ఆధారంగా..)

సేవలను సద్వినియోగం చేసుకోండి



టోల్‌ప్లాజా తరఫున విస్తృతమైన సేవలు అందిస్తున్నాం. మా సిబ్బంది 24 గంటలకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటారు. జాతీయ రహదారిలో ఎప్పుడు, ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా మా టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు. ప్రయాణికుల భద్రతకు అంత్యత ప్రాధాన్యత కల్పిస్తున్నాం. – మదన్‌మోహన్, ఆర్‌ఈపీఎల్ ప్రాజెక్టు హెడ్

పట్టుదలతో శ్రమించి.. గెలిచారు!

ఎస్ఐ ఫలితాల్లో విజయం సాధించి వారంతా కలను నెరవేర్చుకున్నారు. తల్లిదండ్రుల రెక్కల కష్టం మీద చదువుకున్న వారు కొందరైతే.. వివిధ పనులు చేస్తూ విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు మరికొందరు.. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకోసం వేల మందితో పోటీ పడి విజేతలుగా నిలిచారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధించవచ్చని నిరూపించారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

'ఖాకీ' స్వప్నం సాకారం


మహేష్

కల్లూరు: ఖాకీ దుస్తులు ధరించాలనే స్వప్నాన్ని ఉలిందకొండ గ్రామానికి చెందిన గొల్ల మహేష్ నెరవేర్చుకున్నాడు. తల్లిదండ్రులు జి. చిన్న మద్దయ్య, లక్ష్మీదేవి వ్యవసాయ పనులు చేస్తూ కుమారుడిని బీటెక్ వరకు చదివించారు. మొదట 2016లో కానిస్టేబుల్ పరీక్ష, 2018లో ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలు రాసి ఉద్యోగం సాధంచలేకపోయాడు. అనుకున్న లక్ష్యం సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాడు. పట్టుదలతో చదివి 2023లో నిర్వహించిన ఎస్ఐ పరీక్షల్లో విజయం సాధించాడు. అన్న చిన్నయ్య, తమ్ముడు రాజు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగం చేస్తున్నారని, వారితో పాటు తల్లిదండ్రుల సహకారంతో తన కలను నెరవేర్చుకున్నట్లు మహేష్ తెలిపారు.

మాధవరం యువకుడి ప్రతిభ


మద్దెల సతీష్

వెలుగోడు: వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు ఎస్ఐగా ఎంపికై ప్రతిభ కనబరిచాడు. మాధవరం గ్రామానికి చెందిన రైతు బిడ్డ మద్దెల సతీష్ ఎస్ఐగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మద్దెల సంజీవకుమార్ వ్యవసాయం చేస్తూ తన కుమారుడిని ఇంజనీరింగ్ చదివించాడు. ఎస్ఐగా కొలువు సాధించాలనే లక్ష్యంతో సతీష్ కష్టపడి చదివి సాధించాడు. సతీష్‌ను స్థానికులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

అంగన్‌వాడీ ఆయా కుమారుడు ఎస్ఐ


జి. సురేష్

ఆస్పరి: మండల పరిధిలోని కలపరి గ్రామానికి చెందిన జి. శివమ్మ, వీరభద్రి దంపతుల కుమారుడు జి. సురేష్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైయ్యాడు. తల్లి శివమ్మ కలపరిలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్నారు. సురేష్.. డీగ్రీ, పీజీ కర్నూలులో పూర్తి చేసి ఈ ఏడాది తెలంగాణ కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యాడు. ఎస్ఐ కావాలనే లక్ష్యంతో ఆపోస్టుకు వెళ్లలేకపోయాడు. ఇదే ఏడాదే తండ్రి వీరభద్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎలాంటి కోచింగ్ లేకుండా కర్నూలులో రూమ్‌లో ఉంటూ చదువుకొని మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐగా ఎంపికయ్యాడు. తమ్ముడు ఈరన్న బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తమకు ఎలాంటి పొలాలు లేవని, తల్లి శివమ్మ అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తూ చదివించారని సురేష్ తెలిపారు. అమ్మ కష్టంతో చదివి ఎస్ఐగా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

రైతు బిడ్డ ప్రతిభ


వీర ప్రతాప్

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన వీర ప్రతాప్ ఎస్ఐ రాత పరీక్షల్లో ప్రతిభ చూపాడు. ఏపీఎస్పీ విభాగంలో 31వ ర్యాంకు సాధించి ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రైతు కుటుంబానికి చెందిన ఓబులేసు, వెంకట లక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడైన మైదుకూరు వీర ప్రతాప్ ఎంటెక్ పూర్తి చేశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగాన్ని వదిలేసి.. ఇంటి వద్ద ఉండి ఎస్ఐ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ, పోటీ పరీక్షలకు హాజరై ఏపీఎస్పీ ఎస్ఐగా మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగాన్ని సాధించాడు. వీర ప్రతాప్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఒడిదుడుకులు అధిగమించి..


నబిల్లా కరిష్మా

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నబిల్లా కరిష్మా అనే యువతి కష్టపడి చదివి ఎస్ఐ కొలువు సాధించారు. ఎస్ఎంటీ కాలనీకి చెందిన ఎస్.రఫీక్, ఎస్ జరినా దంపతుల నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె నబిల్లా కరిష్మా నవోదయలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. తరువాత పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితితో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఒడిదుడుకులను అధిగమించి ఎస్ఐగా ఎంపికయ్యారు. ఈ యువతిని బంధువులు, కాలనీవాసులు అభినందించారు.

విజయ 'కీర్తన'


నాగకీర్తన


వెలుగోడు: మిడుతూరు స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగకీర్తన ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు. వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన మేడమ్ వెంకటేశ్వర్లు, సరోజా దంపతులకు ఒక కూతురు, కుమారుడు సంతానం. డిగ్రీ వరకు చదువుకున్న వెంకటేశ్వర్లు తాను ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని మధన పడేవాడు. ఈ క్రమంలో పిల్లలను బాగా చదివించాడు. కూతురు నాగ కీర్తన 2019లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. అంతటితో ఆగకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యారు.

పట్టుదలతో చదివి.. విజయం సాధించి


తల్లిదండ్రులతో కోగిల చెన్నయ్య

బనగానపల్లె రూరల్: పట్టుదలతో చదివి ఎస్ఐ ఫలితాల్లో కైప గ్రామానికి చెందిన కోగిల చెన్నయ్య విజయం సాధించాడు. కోగిల మోహన్‌దాసు, జయమ్మ దంపతుల కుమారుడైన చెన్నయ్య బనగానపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2014లో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాడు. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో టెలికం అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూనే ఎస్ఐ పరీక్షలకు సిద్ధమయ్యాడు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడు. తన తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ.. తనను చదివించారని, పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేస్తానని కోగిల చెన్నయ్య తెలిపారు.

గజవాహనంపై సత్య నారాయణుడిగా..



బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి లక్ష్మీసమేత నరసింహస్వామి అమ్మవార్లకు సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మద్దిలేటి నరసింహస్వామి సత్యనారాయణమూర్తి అలంకారంలో గజవాహనం విహరించారు. పూజల్లో ఆలయ ఈఓ రామ చంద్రుడు, ఈఓ పాండు రంగారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

దళితుడిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

- నిందితులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

రుద్రవరం: టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. దళిత కాలనీల్లో భయభ్రాంతులు సృష్టించేలా అకారణంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. మండల పరిధిలోని పేరూరు దళిత కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామనాథరెడ్డి, నాగేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు గురువారం రాత్రి ఆ పార్టీకి చెందిన కర పత్రాలు పంచుతూ దళిత కాలనీలోకి వెళ్లారు. ఆ కాలనీకి చెందిన కోనేటి చిన్న ఓబయ్య నిలిచి ఉండగా అకారణంగా టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. కులం పేరుతో దూషిస్తూ తాము కాలనీలోకి వస్తోంటే ఎదురుగా నిలుస్తావా అంటు గట్టిగా కేకలు వేస్తూ కాళ్లు చేతులతో దాడి చేసి కుళ్ల పొడిచారు. ఆ నొప్పుల బాధ తాళలేక బాధితుడు రుద్రవరం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు ఇవ్వడంతో ప్రధాన నిందితులైన రామనాథరెడ్డి, నాగేశ్వరరావులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

మహానంది: నంద్యాల – గిద్దలూరు రహదారిలో శుక్రవారం నల్లమల ఘాట్ రోడ్‌లో వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్, ఐషర్ లారీ ఢీకొన్నాయి. దీంతో దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ నెలకొంది. వరిగడ్డి ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ సమయంలో జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు వాహనాలు దెబ్బ తినడంతో రోడ్డుపై నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో వాహనాలను పక్కకు తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

గూడేలలో అభివృద్ధి పనులకు సహకరించండి


ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్ రెడ్డితో పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని లోతట్టు గిరిజన గూడేలలో చేపట్టే అభివృద్ధి పనులకు అటవీ శాఖ సహకరించాలని శుక్రవారం విజయవాడలో అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ వై.మధుసూదన్‌రెడ్డిని కోరినట్లు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లాలలోని చెంచు గిరిజన ఆవాసాలైన పెద్దచేమ, మర్రిపాలెం, సుదేకులపాడు, పెద్దమంతనాల చెరువు గూడెం, అల్లిపాలెం, చెన్నపాలెం, పుల్లలచెరువు, తుమ్మలబైలు తదితర గూడేలలో రోడ్ల నిర్మాణం, పక్కాగృహాల నిర్మాణం, విద్యుదీకరణ పనుల చేపడుతున్నట్లు చీఫ్ కన్జర్వేటర్‌కు వివరించినట్లు పీఓ తెలిపారు. అటవీ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని కోరగా చీఫ్‌కన్జర్వేటర్ సానుకూలంగా స్పందించినట్లు పీఓ చెప్పారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలు దారుణహత్య

- బీరువాలో బంగారు, నగదు, ఆస్తి పత్రాలు మాయం
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు


గ్లాడియా (ఫైల్)

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాలలోని ఎన్‌జీవోస్ కాలనీలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు గ్లాడియా (65) శుక్రవారం దారుణహత్యకు గురయ్యారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. సుధాకర్‌రావు, గ్లాడియా దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికి వివాహాలు కావడంతో ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దూరదర్శన్ చానల్‌లో ఏడీగా పనిచేసి రిటైర్డ్ అయిన సుధాకర్‌రావు ఏడాది క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. రిటైర్డ్ ఉపాధ్యాయురాలు గ్లాడియా ఒంటరిగా ఇంట్లో ఉంటుంది. శుక్రవారం ఉదయం ఆమె ఇంట్లో పనిమనిషి రాగా ఇంటికి తలుపులకు తాళం వేసి ఉండటంతో అనుమానంతో కిటికీ నుంచి తొంగి చూడగా మంచంపై గ్లాడియా రక్తపుమడుగులో పడి ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలానికి డీఎస్పీ మహేశ్వర రెడ్డి, సీఐలు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు హుటాహుటిన చేరుకున్నారు. తలుపులు తెరిచి చూడగా గ్లాడియా నోట్లో బట్టలు కుక్కి, కారం పొడి చల్లి కత్తితో పొడిచిన గాయాలను పోలీసులు గుర్తించారు. బీరువాలో ఉన్న గ్లాడియా బంగారు ఆభరణాలు, నగదు, ఆస్తిపత్రాలను దుండగులు అపహరించినట్లు గమనించారు. సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలను పరిశీలించగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక కారు గ్లాడియా ఇంటి సమీపంలో తిరిగినట్లు గుర్తించారు. అయితే ఎవరైనా దొంగలు రెక్కీ నిర్వహించి గ్లాడియాను హత్య చేసి దొంగతనానికి పాల్పడ్డారా..లేక తెలిసి వారు ఎవరైనా కావాలనే ఆమెను హత్య చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. గ్లాడియా పెద్ద కుమార్తె శృతి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.